

www.vibharenews.com

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర్ రెడ్డి ఆదివారం 19-03-2023 సంపుటి : 04 సంచిక : 178 పేజీలు : 4 వెల : రూ 3-00


## అవన్నీ యూపీఏ హయాంలోని కేసులే.. సీబీఐ, ఈడీ దాడులపై అమిత్ షా



దిల్లీ: సీబీఐ ఈడీ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలను కేంద్ర ప్రభుత్వం దుర్వినియోగం చేస్తోందంటూ ప్రతిపక్షాలు చేస్తోన్న విమర్శలకు హోంశాఖ మంత్రి అమిత్ షా గట్టి సమాధానం ఇచ్చారు.సీబీఐ, ఈడీ దర్యాప్తు చేస్తోన్న కేసుల్లో రెండు మినహా మిగతావన్నీ యూపీఏ హయాంలో నమోదైనవేనని అన్నారు. ఆ సంస్థలు పాదర్శకంగా పనిచేస్తున్నాయని అన్న కేంద్ర మంత్రి.. ఆ దర్యాప్తుల్లో తప్పుందనిపిస్తే కోర్టుకెళ్లొచ్చని తెలిపారు. శుక్రవారం దిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు."2017 ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ కు చెందిన ఓ బడా నాయకురాలు మాట్లాడుతూ.. 'అవినీతి పాల్పడితే ఎందుకు విచారించట్లేదు' అని మమ్మల్ని ప్రశ్నించారు. ఇప్పుడు దర్యాప్తు సంస్థలు ఆ పని చేస్తుంటే మేం కుట్ర చేస్తున్నామని ఆరోపిస్తున్నారు. ఈ దర్యాప్తు సంస్థలు కోర్టులకు అతీతమేమీ కాదు. నోటీసులు, ఎఫ్ఐఆర్‌లు, ఛార్జ్‌షీట్లపై వారు న్యాయస్థానాల్లో సవాల్ చేయొచ్చు. వారు కోర్టులకు వెళ్లకుండా బయట ఎందుకు అరుస్తున్నారు..? కోర్టులకు వెళ్లకుండా వారిని ఎవరు అడ్డుకుంటున్నారు? మా కంటే వారి పార్టీలోనే (కాంగ్రెస్‌ను ఉద్దేశిస్తూ) మంచి లాయర్లున్నారు. అయినా ఓ వ్యక్తిపై అవినీతి ఆరోపణలు వచ్చినప్పుడు దర్యాప్తు చేపట్టకూడదా? ఇప్పుడు దర్యాప్తు చేస్తున్న కేసుల్లో రెండు మినహా మిగతావన్నీ వారి ప్రభుత్వంలో(యూపీఏ హయాం) నమోదైనవే" అని అమిత్ షా పేర్కొన్నారు.10 ఏళ్ల యూపీఏ పాలనలో రూ.12లక్షల కోట్ల విలువైన కుంభకోణాలు చోటుచేసుకున్నాయని అమిత్ షా ఈ సందర్భంగా దుయ్యబట్టారు. అప్పుడు పరిస్థితులను సద్దుమణిగించేందుకు నాటి యూపీఏ ప్రభుత్వం సీబీఐతో కేసులు నమోదు చేసిందని గుర్తుచేశారు. అందులో ఏమైనా మనీలాండరింగ్ ఆరోపణలు వస్తే.. ఈడీ తప్పకుండా దర్యాప్తు చేస్తుందని తెలిపారు. "దర్యాప్తు సంస్థలు నిష్పక్షపాతంగా పనిచేస్తు న్నాయి. ప్రతి ఒక్కరూ చట్టాలను పాటించాల్సిందే. అదొక్కటే మనకున్న మార్గం" అని అమిత్ షా తెలిపారు. ఈ సందర్భంగా అదానీ-హిండెన్‌బర్గ్ వ్యవహారంపైనా అమిత్ షా స్పందించారు. "ఆ ఆరోపణలపై దర్యాప్తు చేపట్టేందుకు సుప్రీంకోర్టు ఇద్దరు విశ్రాంత న్యాయమూర్తులతో కమిటీ ఏర్పాటు చేసింది. ఈ వ్యవహా రంపై ఎవరి దగ్గరైనా సాక్ష్యాలుంటే ఆ కమిటీకి సమర్పించొచ్చు. తప్పు జరిగిందని తేలితే ఎవర్నీ వదిలిపెట్టబోం. న్యాయపరమైన ప్రక్రియపై అందరూ విశ్వాసం ఉంచాలి. అయితే, నిరాధారమైన ఆరోపణలు చేయకూడదు. అటు సెబీ కూడా దీనిపై దర్యాప్తు చేస్తోంది" అని అమిత్ షా వివరించారు.

# నేడు ఎన్టీఆర్ జిల్లా తిరువూరుకి సీఎం జగన్..



ఎన్టీఆర్ జిల్లా: జిల్లాలోని తిరువూరులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటించనున్నారు. జగనన్న విద్యాదీవెన పథకం నాలుగో విడత నిధులను సీఎం జగన్ విడుదల చేయనున్నారు.11 లక్షల మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ. 700 కోట్ల రూపాయలు జమచేయనున్నారు. అనంతరం బహిరంగ సభలో ముఖ్యమంత్రి ప్రసంగించనున్నారు.సీఎం జగన్ తిరువూరు పర్యటన నేపథ్యంలో.. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే వెల్లంపల్లి శ్రీనివాస్ శనివారం మాట్లాడుతూ.. వైఎస్ జగన్ సీఎం అయిన తర్వాత చదువుల్లో విప్లవం తెచ్చారని ప్రశంసించారు. ప్రతీ ఒక్కరూ చదువుకోవాలనే లక్ష్యంతో పనిచేస్తున్నారని.. కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దారని పేర్కొన్నారు. ఈ మూడేళ్లలో 31.4 లక్షల మందికి జగనన్న విద్యాదీవెనను చేరువ చేశారని తెలిపారు.'గతంలో పేదలకు చదువు భారంగా మారింది. ప్రభుత్వ విద్యను చంద్రబాబు పూర్తిగా నిర్వీర్యం చేశాడు. ప్రైవేట్ విద్యాసంస్థల బలోపేతం చేసే దిశగా పనిచేశాడు. చంద్రబాబు కేవలం 16 లక్షలు మందికి ఫీజులరీయింబర్స్ మెంట్ ఇచ్చారు చదువు ద్వారానే అన్నీ సాధ్యమని నమ్మిన వ్యక్తి జగన్. అందుకే విద్యకు

### జగనన్న విద్యాదీవెన నిధుల విడుదల

పెద్దపీట వేశారు' అని పేర్కొన్నారు.విద్యాదీవెన కార్యక్రమం రేపు తిరువూరులో సీఎం ప్రారంభిస్తారు. పేదలు సైతం కార్పొరేట్ స్కూల్స్ లో చదవాలనేది సీఎం ఆలోచన. ఇంగ్లీష్ మీడియానికి ప్రాధాన్యత ఇచ్చారు. చంద్రబాబు కోర్టులకు వెళ్లి అడ్డుకున్నా న్యాయం మా వైపు ఉంది. రూ. 700 కోట్లు రేపు నేరుగా విద్యార్థుల తల్లుల ఖాతాల్లో వేయనున్నారు. చంద్రబాబు విద్యారంగాన్ని విస్మరించాడు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత సీఎం జగన్ తరహాలో ఎవరూ విద్యకు ప్రాధాన్యత ఇవ్వలేదు. ఇతర రాష్ట్రాలు కూడా ఇక్కడ ప్రభుత్వ స్కూల్స్ ను చూసి ఆశ్చర్యపోతున్నాయి. ఏపీలోలాగా తమ రాష్ట్రాల్లోని స్కూల్స్‌ను తీర్చిదిద్దాలని ఆలోచన చేస్తున్నాయి.

## ఉత్కంఠ.. పశ్చిమ రాయలసీమలో తెదేపా ఆధిక్యం

అనంతపురం: ఆంధ్రప్రదేశ్ శాసనమండలిలో మూడు పట్టభద్రుల స్థానాలకు జరిగిన ఎన్నికల్లోరెండు చోట్ల తెదేపా జయకేతనం ఎగురవేయగా..పశ్చిమ రాయలసీమలో మాత్రం వైకాపా, తెదేపాపార్టీల అభ్యర్థుల మధ్య హోరాహోరీ పోరు కొనసాగుతోంది. ఇక్కడ ఓట్ల లెక్కింపు ఉత్కంఠగా సాగుతోంది. ప్రతి రౌండ్‌లోనూ తెదేపా, వైకాపా బలపరిచిన అభ్యర్థుల మధ్య నువ్వా నేనా అన్నట్లుగా పోటీ నడుస్తోంది. అనంతపురం జేఎన్‌టీయూలో గురువారం ప్రారంభమైన ఓట్ల లెక్కింపు శనివారం కూడా కొనసాగుతోంది. 11 రౌండ్లలో తొలి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు పూర్తి కాగా.. మొత్తంగా 2,45,687 ఓట్లు పోలైనట్టు గుర్తించారు. వీటిలో 2,26,405 ఓట్లు చెల్లుబాటు అయినట్టు తేల్చారు. మొత్తం ఓట్లలో 19,239 ఓట్లు చెల్లనివిగా పరిగణించారు. తొలి ప్రాధాన్యతా ఓట్ల లెక్కింపులో ఎవరికీ గెలుపునకు కావాల్సిన ఓట్లు రాకపోవడంతో.. ప్రస్తుతం రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపును కొనసాగిస్తున్నారు. ఈ స్థానంలో మొత్తం 49మంది అభ్యర్థులు పోటీ పడ్డారు. మొత్తం 2,26,405 ఓట్లలో 50శాతంతో పాటు అదనంగా మరో ఓటు అంటే 1,13,204 ఓట్లు సాధించిన అభ్యర్థిని విజేతగా ప్రకటించనున్నారు.అభ్యర్థుల విజయానికి కావాల్సిన ఓట్ల కోసం కనిష్ఠ ఓట్లు సాధించిన అభ్యర్థుల రెండో ప్రాధాన్యత ఓట్లు లెక్కిస్తూ వస్తున్నారు. రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులో ఇప్పటివరకు 41 మంది అభ్యర్థుల ఓట్ల లెక్కింపును సిబ్బంది పూర్తి చేశారు. వీరి బ్యాలెట్లలో రెండో ప్రాధాన్యత ఓట్లు లెక్కింపు పూర్తయిన తర్వాత వైకాపా అభ్యర్థికి 96,842 ఓట్లు రాగా, తెదేపా అభ్యర్థికి 95,188 ఓట్లు వచ్చినట్టు అధికారులు వెల్లడించారు. ఆ తర్వాత భాజపా అభ్యర్థి రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు పూర్తయిన తర్వాత తెదేపా అభ్యర్థి భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి 400 ఓట్ల ఆధిక్యంలో కొనసాగుతున్నారు. ప్రస్తుతం పీడీఎఫ్ అభ్యర్థి నాగరాజు రెండో ప్రాధాన్యత ఓట్లు లెక్కిస్తున్నారు. తొలి ప్రాధాన్యత ఓట్లు పూర్తయ్యే సరికి ఉన్నప్పటి కంటే వైకాపా అభ్యర్థి మెజార్టీ క్రమంగా తగ్గుతూ వస్తుండటం గమనార్హం. మరోవైపు, లెక్కింపు కేంద్రం నుంచి వైకాపా మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్ రెడ్డి వెళ్లిపోయారు.అనంతపురంలో తెదేపా మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి, తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు కాలవ శ్రీనివాసులును పోలీసులు గృహనిర్బంధం చేశారు. వారు కౌంటింగ్ కేంద్రానికి వెళ్తారని ముందస్తు చర్యల్లో భాగంగా వారిని ఇంటివద్దే అడ్డుకున్నారు. మరోవైపు, జిల్లా వ్యాప్తంగా తెదేపా నేతలను ఎక్కడికక్కడ నేతలను పోలీసులు గృహనిర్బంధం చేస్తుండటంతో ఉద్రిక్తత నెలకొంది.ఉత్తరాంధ్ర, తూర్పు రాయలసీమ పట్టభద్రుల(గ్రాడ్యుయేట్) ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెదేపా సత్తా చాటింది. ఉత్తరాంధ్ర తెదేపా అభ్యర్థి వేపాడ చిరంజీవిరావు రెండో ప్రాధాన్య ఓటుతో విజయదుందుభి మోగించారు. తూర్పు రాయలసీమ పట్టభద్రుల్లో తెదేపా అభ్యర్థి కంచర్ల శ్రీకాంత్ గెలుపొందారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలో మొదటి రౌండ్ నుంచి ఆధిక్యం కనబరిచిన చిరంజీవిరావు గెలుపునకు అవసరమైన కోటా ఓట్లను సాధించి విజయం సాధించారు. మొదటి ప్రాధాన్యత ఓట్లలో ఎనిమిది రౌండ్లు పూర్తయ్యేసరికి చిరంజీవిరావుకు 82,958 ఓట్లు, వైకాపా అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు 55,749 ఓట్లు, పీడీఎఫ్ అభ్యర్థి రమాప్రభకు 35,148 ఓట్లు, భాజపా అభ్యర్థి పీవీఎన్ మాధవ్‌కు 10,884 ఓట్లు పోలయ్యాయి. చిరంజీవిరావు విజయం సాధించేందుకు ఇంకా 11,551 ఓట్లు కావాల్సి ఉండటంతో అధికారులు ద్వితీయ ప్రాధాన్యత ఓట్లు లెక్కించారు. తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెదేపా ఎమ్మెల్సీ అభ్యర్థి కంచర్ల శ్రీకాంత్.. వైకాపా అభ్యర్థి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని ఓడించారు.

## తెదేపా సంబరాలు చేసుకోవడంతోనే అంతా అయిపోలేదు: సజ్జల



అమరావతి: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వచ్చిన ఓట్లన్నీ తెదేపావి కావని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి వ్యాఖ్యానించారు.పీడీఎఫ్ ఇతర వామపక్షాలకు చెందిన ఓట్లే తెదేపా వైపు మళ్లాయన్నారు. ఎన్నికలు జరిగిన స్థానాలు అన్నింటినీ కలిపి చూడాలని సూచించారు. ఏ రకంగానూ ఈ ఎన్నికలు ప్రభుత్వ వ్యతిరేకతను ప్రతిఫలించవన్నారు. తెదేపా సంబరాలు చేసుకోవడంతోనే అంతా అయిపోలేదని, ఈ ఫలితాలను తాము హెచ్చరిక గా భావించడం లేదని సజ్జల స్పష్టంచేశారు.ఈ ఓటర్లు మొత్తం సమాజాన్ని ప్రతిబింబించే పరిస్థితి లేదని తెలిపారు. ఒక వర్గం ఓటర్లను మొత్తానికి ఎలా అపాదిస్తారని ప్రశ్నించారు. తాము అందించే సంక్షేమ పథకాల పరిధిలో పట్టభద్రుల ఓటర్లు లేరన్నారు. యువతకు పెద్ద ఎత్తున రిక్రూట్ మెంట్ నోటిఫికేషన్లు జారీ చేశామన్నారు. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో సంఖ్యాబలం లేకపోయినా తెదేపా పోటీ చేసిందని, తెలంగాణలో చేసిన తరహాలోనే తెదేపా ప్రయత్నాలు చేయొచ్చునని ఎద్దేవాచేశారు. అనంతపురంలో రీకౌంటింగ్ చేయాలని ఈసీకి ఫిర్యాదు చేశామన్నారు.

## 'సీఎం జగన్ అసాధ్యాన్ని సుసాధ్యం చేశారు'



అమరావతి: అసెంబ్లీ ఐదో రోజు బడ్జెట్ సమావేశాల సందర్భంగా విశాఖపట్నం గ్లోబల్ ఇన్వెస్టర్ల సమ్మిట్‌పై చర్చ జరిగింది. ఈ నేపథ్యంలో సమ్మిట్‌పై మంత్రులు, ఎమ్మెల్యేలు కీలక వ్యాఖ్యలు చేశారు.యువతకు ఉపాధి కల్పించే రంగాలపై ప్రధానంగా దృష్టి పెట్టినట్టు తెలిపారు. దేశంలోని ప్రముఖ పారిశ్రామికవేత్తలంతా జీఐఎస్‌కు వచ్చినట్టు స్పష్టం చేశారు. అనేక రంగాల్లో ఎంఓయూలు కుదుర్చుకున్నామన్నారు.మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మక మార్పులు తెచ్చారు. ఇంధన రంగంలో భారీగా పెట్టుబడులు వచ్చాయి. పరిశ్రమల ద్వారా వేలాది మంది యువతకు ఉపాధి దొరుకుతుందన్నారు.మంత్రి ఆర్కే రోజా మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్ యూత్ ఐకాన్. జీఐఎస్‌తో సీఎం వైఎస్ జగన్ ఖ్యాతి విశ్వవ్యాప్తం అయ్యింది. పరిశ్రమల ద్వారా ఆరు లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు దొరుకుతాయి. రాష్ట్ర ప్రభుత్వం, సీఎం జగన్ పట్ల పారిశ్రామికవేత్తలు విశ్వాసంతో ఉన్నారు. టీడీపీ నేతల గోబెల్స్ ప్రచారాన్ని గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్‌తో తిప్పికొట్టాం. దిగ్గజ పారిశ్రామికవేత్తలంతా ఒకే వేదికపైకి రావడం ఎన్నడూ లేదు. జె అంటే జగన్.. జె అంటే జోష్ అని పారిశ్రామికవేత్తలే చెప్పారు. జీఐఎస్‌తో సీఎం జగన్ ట్రెండ్ సెట్టర్ అని మరోసారి రుజువు చేశారు. పర్యాటక రంగంలో 129 ఎంవోయూలు కుదుర్చుకున్నాం. 40 ఇయర్స్ అని చెప్పుకునే చంద్రబాబు రాష్ట్రానికి అన్యాయం చేశారు. చంద్రబాబు హయంలో ప్రచారం ఎక్కువ.. పెట్టుబడులు తక్కువ అని ఎద్దేవా చేశారు.అబ్బయ్య చౌదరి మాట్లాడుతూ.. చంద్రబాబు గ్రాఫిక్స్‌తో పెట్టుబడులు చూపించారు. వేం దిగ్గజ పారిశ్రామికవేత్తలను ఒకే వేదికపైకి తీసుకొచ్చాం. రూ.13లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు తెచ్చాం. గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్ సూపర్ హిట్. జీఐఎస్‌తో సీఎం జగన్ అసాధ్యాన్ని సుసాధ్యం చేశారు. జీఐఎస్ సక్సెస్ చూసి ఎల్లో బ్యాచ్‌కు గ్యాస్ ట్రబుల్ వచ్చింది. జీఐఎస్ సక్సెస్ చూసి లోకేష్‌కు మైండ్ బ్లాంక్ అయ్యింది. లోకేష్ ఏం మాట్లాడుతున్నారో ఆయనకే తెలియడం లేదు. మాది గ్రాఫిక్స్ ప్రభుత్వం కాదు.. చేతల ప్రభుత్వం అని స్పష్టం చేశారు.

## ఢిల్లీ పర్యటనలో జరిగింది చెప్పాలి

### టీడీపీ ప్రజాప్రతినిధులు

అమరావతి అసెంబ్లీ ప్రాంగణంలో టీడీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మీడియాతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కింజరాపు అచ్చెన్నాయుడు, నిమ్మల రామానాయుడు, డోలా బాలవీరాంజనేయస్వామి, ఎమ్మెల్సీ దీపక్ రెడ్డి లు పాల్గొన్నారు.అచ్చెన్నాయుడు మాట్లాడుతూ ? ఢిల్లీవెళ్లి ప్రధానితో మాట్లాడి, జగన్ రాష్ట్రానికి ఏంసాధించాడో ఆయనే చెప్పాలి. అప్పులఅప్పారావు బుగ్గనతో ఆవుకథలు చెప్పిస్తే ప్రజలు నమ్మరనిఅన్నారు.విభజనచట్టంలోని హామీలసాధనకోసమే జగన్ ఢిల్లీవెళ్లాడని అప్పులఅప్పారావు బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి శాసనసభలో ఆవుకథచెప్పాడు. ముఖ్యమంత్రి ఏపనిమీద ఢిల్లీవెళ్తే మీకెం దుకు అని అప్పులఅప్పారావు మమ్మల్ని ప్రశ్నించాడు. జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి హో దాలో 18సార్లుఢిల్లీ వెళ్లాడు. ఏనాడూ దానిపై మేంసభలో మాట్లాడలేదు. కానీ ఇప్పుడు బడ్జె ట్ సమావేశాలుజరుగుతున్న సమయంలో ముఖ్యమంత్రి హుటాహుటిన ఢిల్లీవెళ్లారుకాబట్టే తాము ఏంసాధించడానికి ఆయన ఢిల్లీవెళ్లారో చెప్పాలంటూ వాయిదాతీర్మానం అందించాం. దానికి సమాధానంచెప్పకుండా బుగ్గన మమ్మల్ని తప్పుపట్టాడు.

## వివక్ష లేదు.. 'నవరత్నాల పథకాలు' యాడ్స్‌పై మంత్రి వేణు క్లారిటీ



అమరావతి: నవరత్నాల పథకాల యాడ్స్‌పై శాసనమండలిలో మంత్రి చెల్లుబోయిన వేణుగోపాల్ క్లారిటీ ఇచ్చారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో నవరత్నాల పథకాలు అమలు అవుతున్నాయన్నారు.పథకాలకు సంబంధించిన సమాచారం ప్రజలకు తెలియజేయడానికి యాడ్స్ ఇస్తున్నామని పేర్కొన్నారు. తమ ప్రభుత్వంలో యాడ్స్ ఇచ్చే వ్యవహారంలో ఎక్కడా వివక్ష లేదని స్పష్టం చేశారు. ఇప్పటివరకు రూ.128 కోట్ల ప్రకటనలు ఇచ్చామని తెలిపారు."గత తెలుగుదేశం ప్రభుత్వం యాడ్స్ కోసం రూ.449 కోట్లు ఖర్చు చేసింది.

యాడ్స్ ఇచ్చే వ్యవహారంలో పారదర్శకత లేదు. ఇష్టానుసారంగా ఎవరికి పడితే వాళ్లకి యాడ్స్ ఇచ్చారు. రాష్ట్రానికి సంబంధం లేని ఇతర రాష్ట్రాలకు చెందిన పేపర్లకు కూడా యాడ్స్ ఇచ్చారు. తెలుగుదేశం ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్న పత్రికలకు పెద్దపీట వేశారు. ఈనాడు పత్రికకు 50 శాతం రేటు పెంచి రూ.120 కోట్లు యాడ్స్ ఇచ్చారు. సర్కులేషన్ లో మూడో స్థానంలో ఉన్న ఆంధ్రజ్యోతికి నిబంధనలను తుంగలోకి తొక్కి రూ.72 కోట్ల యాడ్స్ ఇచ్చారు" అని మంత్రి మండిపడ్డారు."రెండో స్థానంలో ఉన్న సాక్షి పేపర్‌కు కేవలం రూ.30 కోట్ల యాడ్స్ మాత్రమే ఇచ్చారు. గత ప్రభుత్వం యాడ్స్ ఇవ్వటంలో పూర్తిగా పక్షపాత ధోరణి అవలంబించింది. గత ప్రభుత్వంలో ఒక ఏజెన్సీ ద్వారా యాడ్స్ ఇచ్చేవారు. ఆ ఏజెన్సీకి 15 శాతం కమిషన్ ఇచ్చేవారు. మా ప్రభుత్వంలో డైరెక్టుగా యాడ్స్ ఇవ్వటం వల్ల రూ.80 కోట్లు ఆదా చేశాం" అని మంత్రి తెలిపారు.

# సంపాదకీయం

ఆదివారం 19-03-2023

## భారీగా ఆయుధాలు దిగుమతేనా.. ఆత్మనిర్భరం

మనకు లభించే ముడిపదార్థాలతోనే స్వయం సమృద్ధి సాధిస్తున్నామని 'ఆత్మనిర్భరత' పేరుతో కేంద్ర ప్రభుత్వం ఒక పక్క ప్రచారం చేస్తోంది. భారత దేశం మరో పక్క ఆయుధాల దిగుమతిలో ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉంది. ప్రపంచ దిగుమతుల్లో 2017-22 మధ్య భారత దేశం వాటా 11 శాతంగా కొనసాగుతోందని స్టాక్ హోమ్?లోని అంతర్జాతీయ శాంతి పరిశోధనా సంస్థ (ఎస్ఐపిఆర్ఐ) తాజా నివేదిక వెల్లడించింది. ఈ ఆయుధాల దిగుమతి 2013-17 మధ్య 12 శాతం ఉండగా 2018- 23 మధ్య 11 శాతానికి స్వల్పంగా తగ్గిందని ఆంతర్జాతీయ ఆయుధాల మార్పు ధోరణుల గురించి 2023 మార్చిలో విడుదల చేసిన ఆ నివేదికలో పేర్కొంది.రక్షణ పరికరాల ఎగుమతిలో భారత దేశ వాటా కేవలం 0.2 శాతమని భారత రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపినట్టు అంతర్జాతీయ శాంతి పరిశోధనా సంస్థ గత ఏడాది విడుదల చేసిన నివేదిక వెల్లడించింది. ఇప్పుడది ఇంకా తగ్గింది. గత నెలలో బెంగళూరులో జరిగిన ఎరో ఇండియా 2023 సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ మాట్లాడుతూ, ప్రస్తుతం ఉన్న రక్షణ రంగ ఉత్పత్తుల ఎగుమతి 1.5 బిలియన్ డాలర్ల నుంచి 2024 25 నాటికి 5 బిలియన్ డాలర్లకు పెంచనున్నట్టు చెప్పారు. దేశాల మధ్య ఘర్షణలు, అంతర్జాతీయ ఆయుధ వ్యాపారం, సైన్యం, రక్షణకు సంబంధించిన విషయాల గురించిన పరిశోధనలో 'అంతర్జాతీయ శాంతి పరిశోధనా సంస్థ' ప్రసిద్ధి చెందింది.భారతదేశం 1992 -2022 మధ్య అంతర్జాతీయంగా ఆయుధాల దిగుమతి భారాన్ని ప్రపంచంలో అన్ని దేశాల కంటే ఎక్కువగా భరిస్తోందని ఈ సంస్థ పేర్కొంది. 'భారత దేశానికి చైనా, పాకిస్థానతో ఉన్న ఉద్రిక్తతల వల్ల ఈ ఆయుధా దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది' అని ఆ సంస్థ పేర్కొంది. భారత దేశానికి రక్షణ ఉత్పత్తుల సామాగ్రిని 2013 -22 మధ్య రష్యానే ఎక్కువగా సమకూర్చినప్పటికీ, ఈ దశాబ్దంలో 65 శాతం నుంచి 45 శాతానికి తగ్గింది. యుక్రెయిన్ యుద్ధం వల్ల రష్యాపైన అంతర్జాతీయంగా విధించిన ఆంక్షలతో అక్కడ నుంచి దిగుమతులు ఈ మేరకు తగ్గాయి.పాకిస్థాన్ తన ఆయు?ధాల ఎగుమతిని 2013- 17, 2018- 22 కాలానికి 14 శాతం పెంచుకుని ప్రపంచ ఎగుమతుల్లో 3.7 శాతం వాటాను సంపాదించింది. 'అంతర్జాతీయ శాంతి పరిశోధనా సంస్థ' నివేదిక ప్రకారం 201822 కాలానికి పాకిస్థాన్ దిగుమతి చేసుకునే ఆయుధాల్లో 77 శాతం చైనా నుంచే వస్తున్నాయి. ఆయుధాల ఎగుమతిలో అంతర్జాతీయంగా 40 శాతం వాటా అమెరికాదే. అమెరికా ఇదివరకటి కంటే 14 శాతం ఎక్కువ ఆయుధ ఎగుమతులను పెంచుకుంది. ఈ కాలానికి ఫ్రాన్స్ఎగుమతులు 44 శాతం పెంచుకోగా, రష్యా (31శాతం), చైనా (23 శాతం), జర్మనీ (35 శాతం) ఆయుధాల ఎగుమతులు తగ్గాయి. 2013-17తో పోల్చుకుంటే, 2018-22 కాలానికి ప్రపంచ ఆయుధాల ఎగుమతిలో అమెరికా, ఫ్రాన్స్ కలిపి 51 శాతంతో అగ్రస్థానంలో ఉన్నాయి. ఈ నివేదిక ప్రకారం 2022లో ప్రపంచంలో అత్యధికంగా ఆయుధాలు దిగుమతి చేసుకునే దేశాల జాబితాలో భారత్, ఖతార్ తరువాత 2 శాతంతో ఉక్రెయిన్ మూడవ స్థానంలో నిలబడింది. గత ఏడాది ఫిబ్రవరిలో మొదలైన ఉక్రెయిన్ యుద్ధంతో ఆ దేశానికి ఆయుధాలు ఎగుమతి చేసే 29 దేశాల్లో అమెరికా అగ్రస్థానంలో ఉంది. ఉక్రెయిన్ ఆయుధ సంపత్తిని పెంచే దేశాల్లో పోలెండ్ 17 శాతం, జర్మనీ 11 శాతం, బ్రిటన్ 10 శాతం, సెజ్ రిపబ్లిక్ 4.4 శాతం ఆయుధాలను ఎగుమతి చేస్తున్నాయి. భారత రక్షణ పరికరాల దిగుమతి 2018- 19 మధ్య ఉన్న 46 శాతం నుంచి 2022 నాటికి 36.7 శాతానికి తగ్గిందని ఈ నెల 13వ తేదీ రక్షణ శాఖ సహాయ మంత్రి అజయ్ భట్ రాజ్యసభలో రాతపూర్వకంగా వెల్లడించారు. భారత దేశం ఇప్పటికీ రక్షణ రంగ పరికరాల దిగుమతిలో అగ్రస్థానంలోనే ఉన్నప్పటికీ, స్థానికంగా దొరికే సామాగ్రితోనే రక్షణ రంగ ఉత్పత్తులను చేపడుతున్నామని 'ఆత్మనిర్భర భారత్' అన్న నినాదం కోసం దిగుమతులను తగ్గించి చెప్పడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని మిలిటరీ రిటైర్డ్ అధికారులు మాత్రం అంటున్నారు.భారత వైమానికి దళం కోసం 114 కంబాట్ ఎయిర్క్రాఫ్ట్లు, కొత్తగా భారత నౌకాదళంలో చేరిన విమాన వాహక నౌక ఐఎన్ఎస్ విక్రాంత్ కోసం మరో 26 కంబాట్ ఎయిర్క్రాఫ్ట్ల కొనుగోలు కోసం 45 బిలియన్ డాలర్లు వెచ్చించిందని రిటైర్డ్ బ్రిగేడియర్ రాహుల్ భోంస్లే చెప్పా రు. వీరు ఢిల్లీలోని సెక్యూరిటీ రిస్క్ కన్సల్టెన్సీగా ఉన్నారు. త్రివిధ దళాలకు కలిపి ఆయుధాలు కలిగిన సాధారణ ఏరోనాటిక్ సిస్టం (జిఎఎస్ఐ) 18, ఎంక్యూ 9బి అనే మానవ రహిత సముద్ర రక్షణ వైమానిక వాహనాలు 30 వరకు దిగుమతి చేసుకోవడం ద్వారా ప్రపంచంలో అతి పెద్ద రక్షణ ఉత్పత్తుల దిగుమతి దేశంగా భారత దేశం కొనసాగుతోందని రిటైర్డ్ బ్రిగేడియర్ రాహుల్ భోంస్లే తెలిపారు. 'రక్షణ అవసరాల్లో స్వయం పోషకత్వం సాధించడానికి వాస్తవిక దృష్టితో దీర్ఘకాలికంగా రక్షణ పరికరాల దిగుమతి చేసుకోవడం అవసరం' అని ఆయన పేర్కొన్నారు.కొన్ని పరికరాలను, 410 ప్లాట్ఫారాల దిగుమతులపై 2020 నుంచి నిషేధం విధించినట్టు రక్షణ మంత్రిత్వ శాఖ వర్గాలు తెలిపాయి. 'ఆత్మనిర్భర భారత్' అన్న మాటను ప్రచారం చేసుకోవడానికి ఇలా త్రివిధ దళాల అధికారులు, రక్షణ శాఖ అధికారులు ఆడంబరంగా ప్రకటించుకుంటున్నారని రిటైర్డ్ మూడు నక్షత్రాల భారత వైమానికి అధికారి ఒకరు భిన్నంగా వ్యాఖ్యానించారు.'ఆత్మనిర్భర భారత్' నినాదం రాజుగారి దేవతా వస్త్రాల కథలా ఉందని ఆ అధికారి అన్నారు. 'మేక్ ఇన్ ఇండియా' అనే దాన్ని విజయవంతం చేయాలంటే పెద్ద మొత్తంలో పెట్టుబడి అవసరం అవుతుందని, దీర్ఘ కాలం తీసుకుంటుందని, అప్పటికప్పుడు తయారయ్యేది కాదన్న సత్యాన్ని వెల్లడించడానికి సంబంధిత అధికారులు వెనకాడుతున్నారని తెలిపారు. 'ఆత్మనిర్భర భారత్'ను అమలు చేసి, ఫలితాలు రాబట్టాలంటే ఇది సరళంగా ఉండాలని ఆయన పేర్కొన్నారు.అమెరికా, ఐరోపా దేశాల్లో పశ్చిమ దేశాలు తయారు చేసే హెలికాప్టర్లతో పోటీ పడాలంటే, ఎగిరేటప్పుడు హెలికాప్టర్ల భద్రత అనేది ప్రాథమికమైన లక్షణం. ఈక్విడార్ ఇవేమీ చూడకుండా ఒక నమ్మకంతో కొనడంతో ఇప్పుడు హిందూస్థాన్ ఏరోనాటికల్ లిమిటెడ్తో ఒప్పందాలు చేసుకోవడానికి తడబడుతోంది. గాంధీ నగర్లో గత అక్టోబర్లో జరిగిన డెఫ్ఎక్స్పో 2022 లో హిందూస్థాన్ ఏరోనాటికల్ లిమిటెడ్ చీఫ్ సి.బి. అనంతకృష్ణన్ మాట్లాడుతూ అడ్వాన్సుడు లైట్ హెలికాప్టర్కు అపారమైన ఎగుమతి అవకాశాలున్నాయనడం గమనార్హం. "భారత రక్షణ పరికరాలు, హెలికాప్టర్లను ఎగుమతి చేయాలని భారత ప్రభుత్వానికి ఎంతో ఉన్నతాశయం ఉన్నప్పటికీ, అడ్వాన్సుడు లైట్ హెలికాప్టర్ల సామర్థ్యం పైన వినియోగదారుల నమ్మకాన్ని చూరగొనవలసిన అవసరం ఎంతైనా ఉంది" అని ఒక సీనియర్ పారిశ్రామికాధికారి అన్నారు.


# వైసీపికి డేంజర్ బెల్స్

విజయవాడ, మార్చి 18, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై ఆంధ్రప్రదేశ్ రాజకీయవర్గాలు చాలా ఆసక్తిగా ఎదురు చూశాయి. దీనికి కారణం ప్రజా నాడి ఎలా ఉందో నేరుగా ఓట్ల రూపంలో తెలుసుకునే ఓ అవకాశం రావడమే. స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆయా పార్టీల ఓటర్లు ఓట్లు వేస్తారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లు చాలా పరిమితం. కానీ పట్టభద్రుల ఓటర్లు మాత్రం లక్షల్లో ఉంటారు. మూడు ఎమ్మెల్సీ నియోజకవర్గాలకు సంబంధించి దాదాపుగా పది లక్షల మంది తమ ఓటు హక్కు వినియోగించుకుంటారు. అంటే ప్రజాభిప్రాయాన్ని ఓ రకంగా అంచనా వేయవచ్చు. అందుకే అందరూ ఈ ఫలితాలపై ఆసక్తిగా ఎదురు చూశారు. చివరికి వైఎస్ఆర్సీపీకి షాక్ తగిలింది. రెండు స్థానాల్లో అసలు పోటీ ఇవ్వలేకపోగా కంచుకోట లాంటి స్థానంలో తామే గట్టి పోటీ ఎదుర్కోవాల్సి వచ్చింది. అన్ని చోట్లా గెలుస్తామని కేబినెట్ భేటీలో ముందస్తుగానే మంత్రుల్ని సీఎం జగన్ అభినందించారు. కానీ జరిగింది మాత్రం వేరు. ఉత్తరాంధ్రపై ఈ సారి వైఎస్ఆర్సీపీ చాలా ఎక్కువ ఆశలు పెట్టుకుంది. దానికి కారణం తాము రాజధానిని విశాఖ తీసుకు వస్తున్నామని అక్కడి ప్రజలు తమకు బ్రహ్మరథం పడతారని అనుకోవడమే. అలా అని ఊరుకోలేదు. ఆరు నెలల ముందుగానే అభ్యర్థిని ప్రకటించారు. ఓట్ల నమోదు దగ్గర్నుంచి అన్ని విషయాల్లోనూ కేర్ తీసుకుంది. చివరికి ప్రచారంలోనూ మంత్రులు అంతా తామై వ్యవహరించారు. మంత్రి ధర్మాన ఎక్కడ పట్టభద్రుల ఎన్నికల మీటింగ్ పెట్టినా... వైఎస్ఆర్సీపీకి ఓటేయకపోతే విశాఖ రాజధాని డిమాండ్ను బలహీనపర్చడమేనని సెంటిమెంట్ వాడే ప్రయత్నం చేశారు. అయితే ఎన్ని ప్రయత్నాలు చేసినా పట్టభద్రులైన ఓటర్లు మాత్రం పట్టించుకోలేదు. తెలుగుదేశం పార్టీ అభ్యర్థి వేపాడ చిరంజీవి రావుకే భారీ మెజార్టీ ఇచ్చారు. నిజానికి తెలుగుదేశం పార్టీ ఇక్కడ మొదట గాదు చిన్నికుమారి అనే నేతను అభ్యర్థిగా ప్రకటించింది. కానీ ఆమె బలహీన అభ్యర్థి అని నిర్ణయించుకుని ఫిబ్రవరిలోనే అభ్యర్థిగా ఏకానమీ చిరంజీవిగా ఎంతో మంది గ్రాడ్యుయేట్లకు పరిచయమున్న వేపాడ చిరంజీవి రావును అభ్యర్థిగా ఖరారు చేశారు. ఆయన ఇతర టీడీపీ నేతల కృషితో విస్తృతంగా పర్యటించారు. మంచి ఫలితం సాధించారు. వైఎస్ఆర్సీపీ గెలుపొందడటానికి చేయని ప్రయత్నాలు లేవు. వెండి బిస్కెట్లు పంచారని కూడా ఆరోపణలు వచ్చాయి. ఇక విజయసాయిరెడ్డి నుంచి ఉత్తరాంధ్ర బాధ్యతలు తీసుకున్న



వైవీ సుబ్బారెడ్డి మరింత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ఎమ్మెల్సీ ఓడిపోతే రాజధాని వాదన బలహీనపడుతుందన్న అభిప్రాయంతో చేయాల్సినంత చేశారు. కానీ.. ఫలితం ఏ మాత్రం అనుకూలంగా రాలే?దు. ఇప్పుడు వైఎస్ఆర్సీపీకి ఈ అంశంపై సమీక్ష చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడే అవకాశం ఉంది. ఎందుకంటే.. అమరావతిని కాదని అక్కడ వ్యతిరేకత మూట గట్టుకోవాల్సి వచ్చింది. ఇప్పుడు విశాఖలో కూడా సానుకూలత లేకపోతే రెంటికి చెడ్డ రేవడి అయిపోతుంది పరిస్థితి. వైఎస్ఆర్సీపీ తన ఉత్తరాంధ్ర రాజకీయ వ్యూహంలో మార్పులు చేసుకోవాల్సిన ఆవశ్యకతను ఈ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఉపఎన్నిక తెచ్చి పెట్టిందనుకోవచ్చు. ఒక్క ఉత్తరాంధ్రలోనే కాదు తూర్పు రాయలసీమలోనూ వైఎస్ఆర్సీపీకి గడ్డు పరిస్థితి ఏర్పడింది. ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు పరిధిలోని గ్రాడ్యుయేట్ ఓటర్లు పూర్తి స్థాయిలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి కంచర్ల శ్రీకాంత్ కు మద్దతుగా నిలిచారు. నిజానికి నెల్లూరు వైఎస్ఆర్సీపీ కంచుకోట. చిత్తూరులో అయితే పెద్దిరెడ్డి లాంటి నేత ఉన్నారు. ఆయన ఏ ఎన్నిక జరిగినా పట్టు బిగిస్తున్నారు. ప్రకాశం జిల్లాలోనూ మెజార్టీ వైఎస్ఆర్సీపీ ఎమ్మెల్యేలే. పైగా మూడు రాజధానుల పేరుతో తిరుపితలోనూ గర్జన నిర్వహించారు. అయితే ఇక్కడ కూడా వైఎస్ఆర్సీపీకి ఇబ్బందికర పరిస్థితులు తప్పలేదు. రాజధానిగా విశాఖ వాదనకు.. తూర్పురాయలసీమ ప్రజలు కూడా సంతృప్తిగా లేరు. అమరావతి అయితే సమీపంలోనే ఉంటుందని.. విశాఖ అయితే ఎలా ఉన్న అభిప్రాయం సామాన్య జనాల్లో ఉందని అంచనా వేస్తున్నారు. అదే సమయంలో ప్రకాశం , నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో ఒక్క అభివృద్ధి పని జరగలేదు. వెలిగొండ ప్రాజెక్టుపై ఎన్నో ఆశలు పెట్టిన జగన్ ప్రభుత్వం తాము వచ్చాక జరుగుతున్న పనుల్ని నిలిపివేసి.. రివర్స్ టెండరింగ్ ద్వారా ఇతరులకు పనులు ఇచ్చారు కానీ అసలు ముందుకు సాగలేదు. ఇలాంటివి మూడు జిల్లాల్లో ఉన్నాయి. అదే సమయంలో నిరుద్యోగ సమస్య కూడా యువతను ఆలోచింప చేసినట్లుగా అనుకోవచ్చు. అందుకే.. గట్టి పట్టు ఉన్న ప్రాంతంగా పేరున్న జిల్లాల్లోనూ వైఎస్ఆర్సీపీకి ఎదురు గాలి వీచిందని నమ్ముతున్నారు. ఇప్పుడు ప్రభుత్వం ఈ సమస్యలపై సమీక్ష చేసి.. పరిష్కారాలపై దృష్టి పెట్టాల్సిన పరిస్థితుల్ని గ్రాడ్యుయేట్లు తమ ఓటింగ్ ద్వారా గుర్తు చేశారని అనుకోవచ్చు. పశ్చిమరాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గంలో ఉన్న జిల్లాలు కడప, కర్నూలు, అనంతపురం. ఈ మూడు జిల్లాల్లో వైఎస్ఆర్సీపీ పట్టు గురించి చెప్పాల్సిన పని లేదు. మూడు జిల్లాలకు కలిపి టీడీపీకి ఉన్నది ఇద్దరే ఇద్దరు ఎమ్మెల్యేలు వారు కూడా అనంతపురం జిల్లా నుంచే ఉన్నారు. అంటే ఏకపక్షంగా పట్టభద్రులు ఓటింగ్ చేయాల్సిన నియోజకవర్గం. కానీ హోరాహోరీ పోరు జరుగుతోంది. తెలుగుదేశం పార్టీ అభ్యర్థి గట్టి పోటీ చేస్తున్నారు. అన్ని రౌండ్లలోనూ వైఎస్ఆర్సీపీ అభ్యర్థికి మెజార్టీ వచ్చినప్పటికి అది డబుల్ డిజిట్స్ లోనే ఉంటుంది. అందుకే ఓవరాల్ మెజార్టీ రెండు వేలకు దాటడం లేదు. పీడీఎఫ్ అభ్యర్థులతో టీడీపీ వచ్చిన అవగాహన మేరకు ద్వితీయ ప్రాధాన్య ఓట్లు.. టీడీపీ అభ్యర్థికి వేసిఉంటే.. ఇక్కడ వైఎస్ఆర్సీపీ షాక్ తినొచ్చు. అదే జరిగితే.. వైఎస్ఆర్సీపీ కంచుకోట కూలినట్లవుతుంది. అది వైఎస్ఆర్సీపీ ఆత్మ విశ్వాసాన్ని దెబ్బతీస్తుంది. వైఎస్ఆర్సీపీ ప్రభుత్వం తాము ప్రజా రంజకంగా పరిపాలిస్తున్నామన్న ఓ రకమైన అభిప్రాయంలో ఉంది. క్షేత్ర స్థాయిలో పరిస్థితులు తెలుసుకోవడానికి ఆసక్తి చూపించడం లేదని తాజా ఎమ్మెల్సీ పరిణామాలతో అర్థమైపోతుంది. ఇప్పటి వరకూ ప్రత్యక్షంగా జరిగిన ఎన్నికల్లో ఇలాంటి అనుభవం ఎదురు కాలేదు కాబట్టి.. అలాంటి జాగ్రత్తలు తీసుకోలేదని అనుకోవచ్చు. మరి ఇప్పుడైనా ప్రభుత్వం ఈ విషయంలో సీరియస్గా ఉంటుందా అన్నది ఆసక్తికర అంశం. ప్రత్యర్థులపై రాజకీయ దాడులు ఆపి ప్రజలకు అత్యధిక సమయం కేటాయించాలన్న విశ్లేషణ ఎక్కువగా వినిపిస్తోంది. ఎందుకంటే రాజకీయ ప్రత్యర్థుల్ని టార్గెట్ చేస్తే.. అది వారికి బలం ఇస్తుంది. కానీ టార్గెట్ చేసిన వారికి మైనస్ అవుతుంది. ఎన్నికలకు ఇంకా ఏడాది లేని సమయంలో.. ఈ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను సమీక్షించుకుని.. లోపాలను గుర్తించి సరిదిద్దుకోవాల్సిన అవసరం అధికార పార్టీపై పడిందని అనుకోవచ్చు.

# బీజేపీ ఆశలన్నీ అడియాసలేనా



విజయవాడ, మార్చి 18, ఆంధ్రప్రదేశ్లో బలపడాలన్న బీజేపీ పెద్దల ఆశలన్నీ అడియాసలే అవుతున్నాయి. రోజు రోజుకు బీజేపీ బలపడాల్సింది పోయి బలహీనపడుతుంది. అంతేకాదు పార్టీకి చెందిన కీలక నేతలు ఒక్కొక్కరుగా పార్టీ వీడటం మైనస్ అయితే మిగిలిన వారు వర్గపోరుతో పార్టీకి చేటు తెస్తున్నారు. అంతేకాదు బీజేపీని ఒక తాటిపైకి తీసుకువచ్చే నాయకత్వం లోపించింది అని ఆ పార్టీ నేతలే బాహటంగా చెబుతున్నారు. రాష్ట్ర అభివృద్ధి అంతా కేంద్రం నిధులతోనేనని చెప్పుకుంటున్న బీజేపీ దాన్ని ప్రజల్లోకి చేరవేయడంలో విఫలమవుతుంది. అదే సమయంలో కేంద్ర ప్రభుత్వం విభజన హామీలను పట్టించుకోకపోవడం అనేది ప్రజల్లోకి చొచ్చుకుపోయింది. దీంతో ప్రజలు బీజేపీపై గుర్రుగా ఉన్నారు. ప్రజల్లో ఉన్న ఆ వ్యతిరేకతను తొలగించేందుకు కనీసం బీజేపీ నేతలు ప్రయత్నించడం లేదనే విమర్శలు సైతం ఉన్నాయి. కనీసం స్టార్ కాంపైనర్ కూడా లేరని పార్టీ నేతలు గుసగుసలాడుకుంటున్నారు. దీని ఫలితంగా ఎన్నికలు ఏవైనా బీజేపీకి ఫలితాలు రివర్స్ అవుతున్నాయి.ఇదిలా ఉంటే 2019 ఎన్నికల్లో బీజేపీ ఒంటరిగా పోటీ చేసి ఘోరంగా ఓటమి పాలైంది. అనంతరం జరిగిన స్థానిక సంస్థలు, పరిషత్, కార్పొరేషన్ ఎన్నికల్లోనూ చావుతప్పి కన్నులొట్టబోయిన పరిస్థితి నెలకొంది. ఇంకా చెప్పాలంటే ఎన్నిక ఏదైనా బీజేపీ ముంగిట ఓటమి స్వాగతం పలకాల్సిన పరిస్థితి నెలకొంది. అయితే తాజాగా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు రంగంలోకి దిగింది. తూర్పు రాయలసీమ, పశ్చిమ రాయలసీమ, ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో దిగింది. ఈ ఎన్నికల్లో గెలుపు కోసం పార్టీకి చెందిన రాష్ట్ర నేతలు ప్రయత్నించారు. కేంద్రం పెద్దలు వచ్చినా కానీ అంత ఫేమ్ ఉన్న నేతలు కాకపోవడంతో పట్టభద్రులను ఆకట్టుకోలేకపోయారు. దీంతో ఎమ్మెల్సీ ఎన్నికల్లో చెల్లని ఓట్ల కంటే తక్కువ ఓట్లకే పరిమితమయ్యారు. అంటే దాదాపు డిపాజిట్ కోల్పోయారన్నమాట. ఉత్తరాంధ్రకు చెందిన ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ ఈసారి తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు రంగంలోకి దిగారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీచేసి దారుణమైన ఓటమి చవిచూశారు. గతంలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీవీఎన్ మాధవ్ గెలుపొందారు. అయితే ఈసారి డిపాజిట్ సైతం కోల్పోవడంతో బీజేపీ పరిస్థితి దయనీయంగా మారింది. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి పీవీఎన్ మాధవ్కి డిపాజిట్ కూడా దక్కకపోవడం వెనుక విశాఖ స్టీల్ ప్రైవేటీకరణ అంశం తీవ్ర ప్రభావం చూపిందని తెలుస్తోంది. కనీసం కేంద్ర ప్రభుత్వ సంస్థల్లోని ఓట్లుకూడా కలిసిరాలేదు. అంతేకాదు విశాఖ రైల్వే జోన్, విభజన హామీలు అమలు చేయకపోవడంపై పట్టభద్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రత్యేక హోదా ఇవ్వకపోవడం, రైల్వే జోన్ విషయంలో దాగుడుమూతలు ఆడటం, పోలవరం ప్రాజెక్టుకు నిధులు ఇవ్వకపోవడం ఇలా అనేక అంశాలు యువతను ఆలోచింపజేశాయని తెలుస్తోంది. ఉత్తరాంధ్రలో స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ, రైల్వేజోన్ అంశం బీజేపీని దెబ్బతీస్తే ఇక రాయలసీమ ప్రాంతాల్లో విభజన హామీలు అమలు చేయకపోవడం ఓట్లను దూరం చేసుకుందని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు.

# వివేకా దర్యాప్తు కేసులో జాప్యం ఎందుకు..

కడప, మార్చి 18, వివేకా హత్య కేసు దర్యాప్తు జగుతున్న తీరు..చేరుకుంటున్న ముగింపు దిశ చూస్తే.. ఈ కేసులో సూత్ర ధారులు, పాత్రధారుల పాత్ర అతి తొందరలోనే వెల్లడయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయనే ఎవరైనా భావిస్తారు. ఈ పరిస్థితుల్లో కేసు దర్యాప్తును అడ్డుకోవడానికి ఎవరు ఏ విధంగా ప్రయత్నించినా.. వారిపై అనుమానాలు వెల్లువెత్తడం ఖాయం.సరిగ్గా అదే జరుగుతోంది ఇప్పుడు వివేకా హత్య కేసు విషయంలో.. ఈ కేసు దర్యాప్తు సజావుగా సాగకుండా సాధ్యమైనంత వరకూ జాప్యం జరిగేలా చూడటమే లక్ష్యంగా జరుగుతున్న ప్రయత్నాలు అటువంటి అనుమానాలకే ఆస్కారం కలిగిస్తున్నాయి. అలా ప్రయత్నిస్తున్నవారే ఈ కేసులో దోషులు అన్న నిర్ధారణకు జనం వచ్చేందుకు ఆ ప్రయత్నాలే ఆస్కారం కలిగిస్తున్నాయి.టెక్నికల్ గా కేసులు, పిటిషన్లతో దర్యాప్తు ముందుకు సాగకుండా అడ్డుకుంటూ.. జనం దృష్టిలో పలుచన అవ్వడమే కాకుండా.. నేరం చేసినట్లుగా ప్రజలు నమ్మడానికి వారి ప్రయత్నాలు ఆస్కారం కలిగిస్తున్నాయి. ఇప్పటికే ఈ కేసు దర్యాప్తు ముందుకు సాగకుండా ప్రస్తుతం సీబీఐ విచారణను ఎదుర్కొంటున్న కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి వేసిన పిటిషన్లు చాలవా అన్నట్లు.. హతుడు వైఎస్ వివేకా వద్ద పిఏగా పని చేసిన కృష్ణారెడ్డి కూడా హై కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.ఆయన తన పిటిషన్ లో వైఎస్ వివేకా హత్య ఆస్తుల కోసమే జరిగి ఉంటుందన్న అనుమానాన్ని వ్యక్తం చేశారు. ఇలాంటి వ్యూహమే జగన్ అక్రమాస్తుల కేసు విషయంలోనూ అనుసరించిన విషయాన్ని ఈ సందర్భంగా పరిశీలకులు గుర్తు చేస్తున్నారు. ఒకరి తరువాత ఒకరు అన్నట్లుగా పెద్ద సంఖ్యలో కోర్టుల్లో పిటిషన్లు దాఖలు చేస్తూ కేసు దర్యాప్తు, విచారణ ముందుకు సాగకుండా అడ్డుకోవడమే లక్ష్యం అన్నట్లుగా సాగుతోంది.

# కోనసీమలో నీటి ఎద్దడి



కాకినాడ, మార్చి 18, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో దాళ్వా పంట సాగునీరు లేక ఎండిపోతున్న పరిస్థితి తలెత్తింది. ఈ పరిస్థితి డెల్టా ప్రాంతంలో మరీ దారుణంగా మారింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలో చాలా ఆయకట్టులోని వరిచేలు సాగునీరు అందక బీడుబారుతున్నాయి. దీంతో రైతులు అనేకసార్లు అధికారులకు మొరపెట్టుకుంటున్నా పట్టించుకోకపోవడంతో రైతులు నిరసన బాట పడుతున్నారు. ఈ క్రమంలోనే అమలాపురం రూరల్ మండలంలోని జనుపల్లి, వేమవరం తదితర గ్రామాల్లోని థైలాండ్ ప్రాంతంలో చేలు చాలావరకు ఎండిపోయి బీటలు వారడంతో ఆగ్రహించిన పలువురు రైతులు పొలాల్లో మోటారు సైకిళ్లు నడిపి తమ నిరసన తెలిపారు. అధికారులను ఆ ప్రాంతానికి పిలిచి చేలను చూపించి సాగునీరందక పోవడంతో నిలదీశారు. నీరు అందితే చేలు పనిచేస్తాయని పాడుచేసుకోవద్దని హితవు పలికినా రైతులు వినిపించుకోలేదు. ఇక మేము పడలేం అంటూ చేలో మోటారు సైకిళ్లు నడిపి తమ నిరసన తెలిపారు. పి.గన్నవరం నియోజకవర్గంతోపాటు, అమలాపురం గ్రామీణ మండలంలో పలు చోట్ల రైతులు ఇదే తరహా నిరసనలు చేస్తున్నారు.గోదావరి డెల్టా ప్రాంతంలో సాగు నీటి ఎద్దడి తీవ్రంగా ఉంది. ఈనేపథ్యంలో శివారు ప్రాంతాల్లో ఆయకట్టు పూర్తిస్థాయిలో సాగునీరందని పరిస్థితి కనిపిస్తోంది. దీంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఇప్పటికే వంతులవారీ విధానాన్ని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఇరిగేషన్ అధికారులు అమలు చేస్తున్నారు. సెంట్రల్ డెల్టాలోని మూడు ప్రధాన పంటకాలువల ద్వారా వంతుల వారీగా సాగునీటి, తాగునీటి అవసరాలకు విడుదల చేస్తున్నారు అధికారులు. అయితే పలుప్రాంతాల్లో డ్రెయిన్లు, పంటకాల్వలు అధ్వాన్న పరిస్థితిలో ఉండడంతో కాలువల్లో నీరు చాలాచోట్ల వృథాగా పోతోంది. ఇది గమనించిన అధికారులు యుద్ధప్రాతిపదికన 87 చోట్ల నాలుగు ప్రధాన డ్రైన్లకు క్రాస్బండ్లు ఏర్పాటు చేసి అటు సముద్రం నీరు పోటెత్తకుండా ఇటు పంటకాలవుల్లోని సాగునీరు సముద్రంలోకి వృథాగా పోకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు. అయినప్పటికీ డ్రైన్లు, పంటకాలువల వ్యవస్థ దెబ్బతినడంతో చాలా సాగునీరు వృథాపోతుందంటున్నారు. ఇదిలా ఉంటే సాగునీరు చౌర్యానికి గురవుతోంది. ఆక్వారంగం బాగా పెరిగిపోవడంతో చెరువుల్లో ఉప్పునీటి సాంద్రతను తగ్గించుకునేందుకు పంటకాలువల్లో ఇంజిన్లు పెట్టి నీటి చౌర్యాన్ని చేస్తున్నారు. దీంతో వ్యవసాయానికి సాగునీరు అక్కరకు రాకుండా పోతోంది.వాతావరణ శాఖ ప్రకటించినట్లే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా చెదురుమొదురు వర్షాలు కురుస్తున్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలో పలు చోట్ల శుక్రవారం ఉదయం నుంచి వర్షాలు కురుస్తున్నాయి. దీంతో రైతులు కాస్త ఊపిరి పీల్చుకుంటున్నారు. ఎండిపోయిన పొలాల్లో మోటారు సైకిళ్లతో పంటను ధ్వంసం చేసుకున్న రైతులు మాత్రం తాము చేసిన పనిని సమర్థించుకుంటున్నారు.రబీ సాగుకు సాగునీటి కష్టాలు రోజురోజుకూ ఎక్కువ అవుతున్నాయి. చాలా చోట్ల వరి చేలు బీటలువారుతున్నాయి. పంటలు ఎండిపోవడంతో రైతులు తీవ్ర నష్టాలకు గురవుతున్నారు. నీటి కష్టాలు నివారించేందుకు అధికారులు చేపట్టిన చర్యలు ఫలించడంలేదు. కొన్నిరోజులుగా జిల్లాలోని అనేక ప్రాంతాల్లో దాళ్వా సాగుకు నీరు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కోనసీమ జిల్లాలో రబీ సీజన్లో 1.90 లక్షల ఎకరాల్లో వరిసాగు సేద్యం చేశారు. గతంలో తొలకరి పంటను త్యాగం చేసిన రైతులు రబీ పంట సేద్యం చేస్తున్నప్పటికీ పరిస్థితులు చూస్తుంటే ఈ పంటను కూడా కోల్పోయేలా ఉందని రైతుల ఆవేదన చెందుతునన్నారు. జిల్లా వ్యాప్తంగా 69 గ్రామాల్లో 5287 ఎకరాల విస్తీర్ణంలో సాగునీటి సమస్యలు తలెత్తినట్లు జిల్లా యంత్రాంగం గుర్తించింది. వీటి నివారణకు సమీప ప్రాంతాల్లో డ్రైన్లపై క్రాస్బండ్లు వేసి రైతులకు సాగు నీటిని ఇంజిన్ల ద్వారా మళ్లించే ప్రయత్నం చేస్తున్నారు. అమలాపురం సబ్డివిజన్లో 63, రాజోలు సబ్డివిజన్లో 9, రామచంద్రపురం సబ్డివిజన్లో 18 క్రాస్బండ్లు ఏర్పాటుచేసి డ్రైన్లలో నీటిని ఎత్తిపోతల ద్వారా కాల్వ చిట్టచివరి భూములకు అందిస్తున్నామని జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లా స్పష్టం చేశారు.

## నర్సింగ్ విద్యార్థినిని మేడపై నుండి తోసేసిన తోటి విద్యార్థినులు

కోనసీమ అంబెడ్కర్ కోనసీమ జిల్లా ముక్తేశ్వరంలో ఉన్న వైఎస్ ఉ బి.ఆర్.ఎస్.ఎం నర్సింగ్ కాలేజీలో దారుణం జరిగింది తోటి విద్యర్థినిలే మరో విద్యార్థినిని మేడ పై నుండి తోసేవేసారు. నర్సింగ్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని పల్లవి(19), శనివారం ఉదయం రెండవ అంతస్థు పై నుండి గెంటేసారు. ఘటనలో పల్లవి కి తీవ్ర గాయాలు అయ్యాయి. కాలు, చేయి, మూడు చోట్ల ఎముకలు విరిగాయి. పల్లవిని అమలాపురం ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కాలేజీ హాస్టల్ రూంలో ఎనిమిది మంది విద్యార్థినులు కలిసిన ఉంటున్నారు. శుక్రవారం రాత్రి ఒకరి డబ్బులు పోయాయని అందరి బ్యాగ్స్ వెతికారు.

# పాఠశాలల్లో విద్యార్ధులకు బాల్య వివాహాలపై అవగాహన కల్పించాలి

## -:కర్నూలు జిల్లా కలెక్టర్ జి.కోటేశ్వర రావు





కర్నూలు , మార్చి, 18 : పాఠశాలల్లో విద్యార్ధులకు బాల్య వివాహాలపై అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఛైల్డ్ వెల్ఫేర్ కమిటీని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.శనివారం కలెక్టర్ మినీ కాన్ఫరెన్స్ హాలులో ఛైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలో ఉన్న బాల్య వివాహాల కేసులు, తల్లిదండ్రుల నుండి తప్పిపోయిన పిల్లలు, బెగ్గింగ్ పిల్లలు,బాలకార్మిక కేసులకు సంబంధించి జిల్లా కలెక్టర్ త్రైమాసిక సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బాల్య వివాహాలు తగ్గేలా పాఠశాలల్లో చిన్నారులకు 7, 8,9,10 తరగతుల విద్యార్ధులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని, ఈ సదస్సులను ఉపన్యాస పద్ధతిలో కాకుండా చర్చ ల రూపంలో నిర్వహించాలని కలెక్టర్ ఛైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులకు సూచించారు....బాల్య వివాహాలకు సంబంధించి తల్లిదండ్రులకు కూడా అవగాహన కల్పించాలని, సంబంధిత చట్టాలను కూడా వారికి తెలియజేయాలన్నారు. బాల్య వివాహాలు ఎక్కడ జరిగినా సంబంధిత రెవెన్యూ సిబ్బంది కేసులు బుక్ చేయడంతో పాటు తనకు సమాచారం ఇచ్చినట్లయితే, 48 గంటలలో చర్యలు తీసుకొని పరిష్కరిస్తామని జిల్లా కలెక్టర్ తెలిపారు. మూడు నెలలకోసారి కాకుండా ప్రతి 15 రోజులకోసారి బాల్య వివాహాలు, ఇతర అంశాలపై ఛైల్డ్ వెల్ఫేర్ కమిటీ సమీక్షకు రావాలని కలెక్టర్ ఛైర్మన్ జుబేదా బేగం కు సూచించారు...బాల్య వివాహాలు, బాల కార్మికుల కు సంబంధించి పిల్లల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ చేయడం, తప్పిపోయిన పిల్లలను తల్లిదండ్రుల వద్దకు చేర్చడం, ఛైల్డ్ కేర్ కేంద్రాలలో పిల్లల సంక్షేమం తదితర అంశాల్లో ఛైల్డ్ వెల్ఫేర్ కమిటీ చురుగ్గా పని చేయాలని సూచించారు. ఛైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఛైర్మన్ జుబేదా బేగం మాట్లాడుతూ అనాథ పిల్లలు, ఇంటి నుంచి పారిపోయిన పిల్లలు, తప్పిపోయిన కేసులు, బాల కార్మికులు, బాల్య వివాహాల కేసులను ఈ కమిటీ పరిష్కరించి వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి వారికి తిరిగి అప్పగించడంతో పాటు ఇబ్బందులు ఉన్న వారికి పునరావాసం కల్పించడం జరుగుతుందన్నారు. అదే విధంగా ఈ మూడు నెలల కాలంలో పరిష్కారం కాని 7 కేసులు ఉన్నాయని, అందులో ఇద్దరినీ పెద్దపాడు పునరావాస కేంద్రానికి, ఒకరిని విజ్ఞాన్ పునరావాస కేంద్రానికి, నలుగురిని డాన్ బస్కో ఓపెన్ షెల్టర్ లలో ఉంచడం జరిగిందన్నారు. అనంతరం కమిటీలోని సభ్యులు నిర్వహిస్తున్న విధులను జిల్లా కలెక్టర్ కు వివరించారు . అదే విధంగా ఛైల్డ్ వెల్ఫేర్ కమిటీకి ఐసిడిఎస్ నుండి ఇద్దరినీ డిప్యూట్ చేయాలని జిల్లా కలెక్టర్ ను కోరారు.. అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఐసిడిఎస్ పిడిని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. అదే విధంగా ఒక జిల్లా నుంచి ఇంకొక జిల్లాకు పిల్లలను తరలించేటప్పుడు పోలీస్ సిబ్బంది కూడా అందజేయాలని కోరగా అందుకు స్పందించిన జిల్లా కలెక్టర్ అందుకు చర్యలు తీసుకోవాలని పోలీస్ సిబ్బందిని ఆదేశించారు.కార్యక్రమంలో ఐసిడిఎస్ ఇంఛార్జి పిడి ఉమామహేశ్వరి, బాలల సంక్షేమ సభ్యులు మురళీకృష్ణ, వెంకట రామయ్య, కార్మిక శాఖ డిసి, దిశ పోలీసులు, చైల్డ్ హెల్ప్ లైన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సీఎం టూర్ వివరాలు వెల్లడించాలి

విజయవాడ, మార్చి 18, ఐదో రోజు జరుగుతున్న అసెంబ్లి సమావేశాలు ఆరంభంలోనే తెలుగు దేశం నేతలు సభలో నినాదాలు చేశారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఢిల్లీ పర్యటనకు సంబందించిన అంశాలపై చర్చించాలని వాయిదా తీర్మానం అనుమతించాలని పట్టుబట్టారు. దీంతో టీడీపీ సభ్యులను సస్పెండ్ చేయాలని మంత్రి బుగ్గన తొలుత ప్రతిపాదించారు. అచ్చెన్నాయుడు, ఆదిరెడ్డి భవానీ, చినరాజప్ప, బెందాళం అశోక్, గణబాబు, వెలగూపూడి, మంతెన రామరాజు, సాంబశివరావు, గొట్టిపాటి రవికుమార్, బాలవీరాంజనేయ, గద్దె రామ్మోహన్‌ను సస్పెండ్ చేయాలంటూ బుగ్గన సూచించారు. ఈ మేరకు స్పీకర్ వారిని ఒక రోజు పాటు సస్పెండ్ చేస్తున్నట్టు పేర్కొన్నారు. టీడీపీ సభ్యులు సస్పెండ్ కావడం ఇది వరుసగా అయిదోసారి.క్వశ్చన్ అవర్ ప్రారంభం కాగానే టీడీపీ సభ్యులు వాయిదా తీర్మానంపై పట్టుబట్టారు. ముఖ్యమంత్రి జగన్ ఢిల్లీ పర్యటనపై చర్చ జరగాలని డిమాండ్ చేశారు. అయితే టీడీపీ సభ్యుల ప్రతిపాదన సభాసంప్రదాయాలకు విరుద్ధమని శాసనసభా వ్యవహారాల మంత్రి బుగ్గన స్పష్టం చేశారు. సభాసమయాన్ని వృథా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో చంద్రబాబు ఢిల్లీ పర్యటనల గురించీ చర్చించాలంటూ వైసీపీ సభ్యులు డిమాండ్ చేశారు. దీంతో సభలో గందరగోళం మొదలైంది. టీడీపీ సభ్యులు స్పీకర్ పోడియంను చుట్టుముట్టి నిరసన వ్యక్తం చేశారు. టీడీపీ సభ్యుల్లో కొందరు స్పీకర్ చైర్ వద్దకు వెళ్లి తమ ఎజెండా కాపీలను చింపి నిరసన తెలిపారు. దీంతో ఈ విషయమై ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలంటూ స్పీకర్ సభను కోరారు. సభలో తెలుగు దేశం ఆందోళనల పై ఆర్ధిక శాఖ మంత్రి బుగ్గన మాట్లాడుతూ సభాసమయాన్ని వృథా చేయడం సరికాదని సూచించారు. టీడీపీ సభ్యులు మాత్రం ముఖ్యమంత్రి ఢిల్లీ పర్యటనకు కారణం ఏంటో చెప్పాలని పట్టుబట్టారు. స్వప్రయోజనాలకా...రాష్ట్ర ప్రయోజనాల కోసమా... అంటూ తమ నిరసనను కొనసాగించారు. ఇలా సభలో గందరగోళం కొనసాగుతుండటంతో టీడీపీ సభ్యులను సస్పెండ్ చేయాలని మంత్రి బుగ్గన ప్రతిపాదించడం, స్పీకర్ ఆమోదముద్ర వేశారు.ఎన్టీఆర్ టిడ్కో ఇళ్ళకు నాలుగేళ్లుగా తాళాలు ఎందుకు వేసారంటూ ఎమ్మెల్యే నిమ్మల నిరసన వ్యక్తం చేశారు. ప్లకార్డుతో అసెంబ్లీ వెలుపల బ్యానర్ ను ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేశారు. కట్టిన ఇళ్లకు రంగులు కాదు మిగిలిన 10 శాతం పనులు పూర్తి చేయాలన్నారు. నాడు ఉచితమని చెప్పి, నేడు టిడ్కో ఇళ్ళ లబ్ధిదారులను బ్యాంకులకు జగన్ తాకట్టు పెడుతున్నారని, నాలుగేళ్లలో అరబస్తా సిమెంట్ వాడకుండా, ఒక్క రూపాయి ఖర్చు పెట్టకుండా టిడ్కో ఇళ్ళ లబ్ధిదారుల పై జగన్ కక్ష సాధిస్తున్నారని ఆయన మండిపడ్డారు.ఎమ్మెల్సీ స్ధానాల్లో తెలుగు దేశం విజయం సాధించటంపై హర్షం వ్యక్తం చేస్తూ టీడీపీ నేతలు సంబరాలు చేశారు. మాజీ ఎమ్మెల్సీ బుద్ధ వెంకన్న,నాగుల్ మీరా ఆధ్వర్యంలో బుద్దావెంకన్న ఇంటి వద్ద విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ప్రజప్రజావేదిక కోలగొట్టడంతోనే జగన్మోహన్ రెడ్డి పతనం స్టార్ట్ అయిందని, బుద్ధ వెంకన్న అన్నారు. తెలుగు వారు ఎక్కడున్నా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నారని అన్నారు.

# కీ శే బుచ్చల అర్జునుడు పవిత్ర ఆత్మకు శాంతి కలగాలి

## :- వై నాగేశ్వరరావు యాదవ్, తెలుగుదేశం పార్టీ బీసీ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ , జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్

విజయవాడ మార్చి 18 -: విజయవాడ లోని రామ ఫంక్షన్ హాల్ నందు మల్లికార్జున అధ్యక్షతన కీర్తిశేషులు బుచ్చల అర్జునుడు సంతాప సభను శనివారం ఏర్పాటు చేయడం జరిగినది. ఈ సంతాప సభలో తెలుగుదేశం పార్టీ బీసీ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ , జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ నాగేశ్వరరావు యాదవ్ , బీసీ సంఘాలు,ప్రజా సంఘాల నాయకులు, తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొనికీ శే అర్జునుడు కి ఘన నివాళులర్పించడం జరిగింది.ఈ సందర్భంగా నాగేశ్వరరావు యాదవ్ మాట్లాడుతూబడుగు, బలహీన వర్గాల నాయకుడు, బి.సిల ముద్దు బిడ్డ, బందరు మున్సిపల్ చైర్మన్ గా, ఉమ్మడి కృష్ణా జిల్లా టి.డి.పి,అధ్యక్షుడిగా, తెలుగుదేశం పార్టీ జాతీయ క్రమశిక్షణా సంఘం అధ్యక్షుడిగా, ఎంఎల్సీ గా సేవలు అందించిన యదువంశ వీరుడు కీ?శే బచ్చుల అర్జునుడు , వారు లేని లోటు తీరనిది. వారి పవిత్ర ఆత్మకు శాంతితో చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తున్నాము.అర్జునుడు కుటుంబానికి బీసీ సంఘాలు తెలుగుదేశం పార్టీ ప్రజా సంగాలు ఎల్లప్పుడూ తోడుగా ఉంటామన్నారు .




# రూ.506 కోట్లతో కర్నూలు నగరాభివృద్ధి -: మేయర్ బి వై రామయ్య

## ఘనంగా పాలకవర్గ ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు



కర్నూలు మార్చి 18 -:రూ.506 కోట్లతో కర్నూలు నగరాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు నగర మేయర్ బి.వై. రామయ్య అన్నారు. పాలకవర్గం ఏర్పడి రెండేళుసందర్భంగా శనివారం మున్సిపల్ కార్యాలయంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు.మేయర్, డిప్యూటి మేయర్, కార్పొరేటర్లు కేకును కట్ చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ జిల్లా ఇంఛార్జ్ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, ఎం.పి.లు సంజీవ్ కుమార్, పోచా బ్రహ్మానంద రెడ్డి, ఎమ్మెల్యేలు హాఫీజ్ ఖాన్, కాటసాని రాంభూపాల్ రెడ్డి, జరదొడ్డి సుధాకర్ల సహకారంతో నగరాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తున్నామని తెలిపారు. ఈ రెండేళ్లలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు, నగర పాలక నిధులు మొత్తం రూ.505.90 కోట్లతో చేపట్టిన రోడ్లు, డ్రైనేజీ, నీటి ప్రాజెక్టులు, భవనాలు, పార్కుల అభివృద్ధి, వీధిదీపాలు, సుందరీకరణ పనులు వివిధ దశల్లో ఉన్నాయన్నారు.

# యూఎస్ లో నాని దసరా రికార్డు రిలీజ్!




నేచురల్ స్టార్ నాని దసరా సినిమాతో ప్రేక్షకులను అలరించడానికి వస్తున్నాడు. సుకుమార్ దర్శకుడు శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా మార్చి 30న పాన్ ఇండియా లెవెల్లో రిలీజ్ కానుంది.సింగరేణి నేపథ్యంలో భారీగా వస్తోన్న ఈ చిత్రం తెలుగు తమిళ్ కన్నడ మలయాళ హిందీ భాషల్లో ఏకకాలంలో రిలీజ్ కానుంది. ఇక ఈ సినిమా నాని మొట్ట మొదటి పాన్ ఇండియా సినిమా. ఈ చిత్రంలో నాని సరసన కీర్తి సురేశ్ హీరోయిన్ గా నటిస్తోంది. ఈ చిత్రం నుంచి విడుదలైన పాటలు టీజర్స్ ట్రైలర్స్ ఆకట్టుకుంటున్నాయి.ఇక ఈ సినిమాకు సెన్సార్ వాళ్లు ఐ/ఎ సర్టిఫికేట్ జారీ చేశారు. ఇక ట్రైలర్ విడుదలైన సంగతి తెలిసిందే. ఇక ఈ ట్రైలర్లో తెలంగాణ యాసలో నాని పలికిన డైలాగులు ఓ రేంజ్లో పేలుతున్నాయి. ఈ సినిమాలో నాని ధరణి పాత్రలో నటిస్తున్నారు. కీర్తి సురేష్ వెన్నెలగా కనిపించనుంది. పాటలు కూడా ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. ఇక ఈ సినిమాలో ప్రముఖ మలయాళ నటుడు షైన్ టామ్ చాకో విలన్ పాత్రలో కనిపించనున్నారు. తాజాగా ఈ సినిమా గురించి ఓ అప్డేట్ వచ్చింది.మన తెలుగు సినిమాలకు యూఎస్ లో మంచి డిమాండ్ అయితే ఉంది. ఇక నాని కెరియర్లో బిగ్గెస్ట్ మూవీగా ఈ చిత్రం నిలవనుందని టాలీవుడ్ వర్గాల టాక్. అయితే ఈ సినిమా యూఎస్ లో 600పైగా లోకేషన్స్లో వివిధ భాషల్లో విడుదల కానుందని తెలుస్తోంది. సింగరేణి నేపథ్యంలో తెరకెక్కిన ఈ సినిమా అక్కడి ప్రేక్షకులను ఆకట్టుకుంటుందో లేదో వేచి చూడాల్సిందే.ఇక దసరాలో నాని కీర్తి సురేష్తో పాటు మరో కీలకపాత్రలో కన్నడ నటుడు దీక్షిత్ శెట్టి కీలక పాత్రలో కనిపించనున్నారు. ఇతర పాత్రల్లో సముద్రఖని సాయి కుమార్ జరీనా వహాబ్ కనిపించనున్నారు. సంతోష్ నారాయణన్ సంగీతం అందిస్తున్నారు. సత్యన్ సూర్యన్ ఫోటోగ్రఫి. ఈ సినిమాను శ్రీ లక్ష్మి వెంకటేశ్వర సినిమాస్ బ్యానర్పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. ఈ సినిమా తెలుగు తమిళం కన్నడ మలయాళం హిందీ భాషల్లో ఒకేసారి విడుదల కానుంది.

# మగధీర రీరిలీజ్ క్యాన్సల్ కు కారణం ఏంటంటే..?




మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ గురించి తెలుగు సినీ ప్రేక్షకులకు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. చిరుత సినిమాతో టాలీవుడ్ లో అడుగు పెట్టిన ఈయన... తన రెండో సినిమాతోనే సూపర్ డూపర్ హిట్టు కొడతాడని ఏఎరూ ఊహించలేదు. కానీ చెర్రీ తన రెండో సినిమాతోనే సినీ ఇండస్ట్రీ రికార్డులు తిరగరాశాడు. మగధీర సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్టు కొట్టాడు. ఇప్పటికీ అందులోని డైలాగ్ లు పాటలు అంటే అభిమానులకు ఇష్టమే. రాజమౌళి రామ్ చరణ్ కాంబోలో వచ్చిన ఈ సినిమా 2009 జులై 31వ తేదీన విడుదలైంది.అయితే ఇటీవలే ఈ చిత్రం రీరిలీజ్ చేయబోతున్నట్లు ప్రకటించారు. పదమూడేళ్ల క్రితం వచ్చిన ఈ సినిమాను మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ పుట్టిన రోజు నాడు విడుదల చేయాలనుకున్నారు. కానీ చెర్రీ నటించిన ఈ చిత్రాన్ని రీరిలీజ్ చేయడం లేదంటూ గీతా ఆర్ట్స్ అధికారిక ప్రకటన చేసింది. పలు సాంకేతిక సమస్యల కారణంగా ఈ చిత్రాన్ని చెర్రీ పుట్టిన రోజున రిలీజ్ చేయడం వెల్లడించింది. అంతేకాకుండా మరో మంచి సందర్భం చూసుకొని ఈ సినిమాను విడుదల చేస్తామని ప్రకటించింది.మరోవైపు ఈ చిత్రానికి బదులుగా రామ్ చరణ్ పుట్టిన రోజు నాడు ఆరెంజ్ సినిమా రిలీజ్ చేయబోతున్నారు. రామ్ చరణ్ హీరోగా జెనీలియా హీరోయిన్ గా నటించిన ఆరెంజ్ సినిమాను మార్చి 27వ తేదీన రీరిలీజ్ చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు. ఈ చిత్రానికి భాస్కర్ దర్శకత్వం వహించగా.. చెర్రీ బాబాయి మెగా బ్రదర్ కొణిదెల నాగబాబు నిర్మాతగా వ్యవహరించారు. అలాగే ఓ చిన్న పాత్రలో కూడా నటించారు. 40 కోట్ల బడ్జెట్ తో తెరకెక్కించిన ఈ సినిమా డిజాస్టర్ గా నిలిచింది.సినిమా కథ ఎక్కువ మందిని ఆకట్టుకోకపోయినా.. పాటలు మాత్రం బ్లాక్ బస్టర్ హిట్లుగా నిలిచాయి. మరి రెండోసారి రిలీజ్ అయి అయినా రామ్ చరణ్ అభిమానుల్ని ఆకట్టుకుంటుందో లేదో చూడాలి మరి. ప్రస్తుత జనరేషన్ కు ఈ స్టోరీ తగినదని అంతా భావిస్తున్నారు. మరి ఈసారి హిట్టవుతుందో ఫట్టవుతుందో చూడాలి. ఈ సినిమా రీరిలీజ్ చేయగా వచ్చిన డబ్బులు.. జనసేన పార్టీ ఫండ్ డ్రైవ్ కు అందజేస్తామని వెల్లడించారు.

# ధనుష్ కెరియర్లోనే అత్యధిక కలెక్షన్లు రాబట్టిన సినిమాగా సార్



ధనుష్ హీరోగా నటించిన తాజా చిత్రం సార్. తమిళంలో వాతి పేరుతో రిలీజ్ అయిన ఈ సినిమాను తెలుగులో సార్ పేరుతో రిలీజ్ చేశారు. ఈ సినిమా విడుదలై నాలుగు వారాల పూర్తి కాగా... డిజిటల్ రిలీజ్ కూడా అయింది. మార్చి 17వ తేదీ నుంచి ఈ సినిమా నెట్ ఫ్లిక్స్లో స్ట్రీమింగ్ అవుతోంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే థియేటర్లలో ఉన్న ఈ సినిమా వసూళ్లలో భారీ డ్రాప్ కనిపించింది. మొత్తం మీద ఈ సినిమా క్లోజింగ్ కలెక్షన్స్ ఎలా ఉన్నాయి అనే విషయం మీద పరిశీలిస్తే ఈ సినిమా తెలుగు రాష్ట్రాలలో 27వ రోజున దాదాపు 15 లక్షల రేంజ్ లో షేర్ అందుకుంది. 28వ రోజు మాత్రం 11 లక్షల షేర్ మాత్రమే అందుకుంది.ఇక ఈ సినిమా నాలుగు వారాలకు గాను తెలుగు రాష్ట్రాల్లో అందుకున్న కలెక్షన్స్ మీద ఒకసారి కన్నేస్తే నైజాం ప్రాంతంలో ఎనిమిది కోట్ల 93 లక్షలు సీడెడ్ ప్రాంతంలో మూడు కోట్ల 15 లక్షలు ఉత్తరాంధ్ర ప్రాంతంలో మూడు కోట్ల 34 లక్షలు ఈస్ట్ గోదావరి ప్రాంతంలో రెండు కోట్ల నాలుగు లక్షలు వెస్ట్ గోదావరి ప్రాంతంలో 93 లక్షలు గుంటూరు ప్రాంతంలో కోటి 63 లక్షలు కృష్ణాజిల్లాలో కోటి 49 లక్షలు నెల్లూరులో 81 లక్షలు రాబట్టింది.ఇక ఆంధ్ర ప్రదేశ్ తెలంగాణ మొత్తం మీద 22 కోట్ల 32 లక్షల షేర్ 42 కోట్ల గ్రాస్ వసూలు చేసింది. కర్ణాటక సహా మిగతా భారతదేశం మాత్రమే కాకుండా ఓవర్సీస్ లో కూడా కోటి 40 లక్షలు వసూలు చేసి ప్రపంచవ్యాప్తంగా 23 లక్షల 72 కోట్ల షేర్ 45 కోట్ల 15 లక్షల గ్రాస్ వసూలు చేసింది. తమిళ వర్షన్ కూడా కలుపుకుంటే 118 కోట్ల 37 లక్షల గ్రాస్ 61 కోట్ల 71 లక్షల షేర్ వసూళు సాధించింది. మొత్తానికి కొద్ది రోజులకే లాభాల బాట పట్టిన ఈ సినిమా ధనుష్ కెరియర్ లోనే అత్యధిక కలెక్షన్లు రాబట్టిన సినిమాగా నిలిచింది.

# ఆస్ట్రేలియాతో రెండో వన్డే.. టీమిండియా అభిమానులకు బ్యాడ్ న్యూస్! అలా అయితే




ఆస్ట్రేలియాతో తొలి వన్డేలో విజయం సాధించిన టీమిండియా.. ఇప్పుడు విశాఖపట్నం వేదికగా రెండో వన్డేలో అదే జట్టుతో అమీతుమీ తెల్చుకోవడానికి సిద్ధమైంది.ఈ మ్యాచ్లో గెలిచి సిరీస్‌ను కైవసం చేసుకోవాలని భారత జట్టు భావిస్తుంటే.. ఆసీస్ మాత్రం తొలి వన్డే ఓటమికి ప్రతీకారం తీర్చుకోవాలని వ్యూహాలు రచిస్తోంది.అయితే ఈ మ్యాచ్‌కు వర్షం అంతరాయం కలిగించే అవకాశం ఉంది. మార్చి 18 నుంచి 20 వరకు మూడు రోజుల పాటు విశాఖలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఆదివారం మ్యాచ్ జరిగే సమయంలో ఉరుములు, ఈదురు గాలులతో భారీ వర్షం పడే ఛాన్స్ ఉంది ఉందని భారత వాతావరణ విభాగం (ఎఓఆ) ఓ ప్రకటనలో పేర్కొంది.మరోవైపు వర్షం పడితే ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నట్లు.. స్టేడియం నిర్వాహకులు తెలిపారు. వర్షం నుంచి మైదానాన్ని రక్షించేందుకు అవసరమైన అత్యంత తేలికైన పిచ్ కవర్లు తమ వద్ద ఉన్నట్లు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ కూడా ఓ ప్రకటనలో వెల్లడించింది. కాగా ఈ మ్యాచ్ మధ్యాహ్నం 1:30 గంటలకు ప్రారంభం కానుంది.భారత్: శుబ్‌మన్ గిల్, రోహిత్ శర్మ(కెప్టెన్), విరాట్ కోహ్లి, సూర్యకుమార్ యాదవ్, కేఎల్ రాహుల్(వికెట్ కీపర్), హార్దిక్ పాండ్యా (వైస్ కెప్టెన్), రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్, మహ్మద్ షమీ, మహ్మద్ సిరాజ్, శార్దూల్ ఠాకూర్ఆస్ట్రేలియా: ట్రావిస్ హెడ్, మిచెల్ మార్ష్, స్టీవెన్ స్మిత్(కెప్టెన్), మార్నస్ లాబుషేన్, జోష్ ఇంగ్లిస్(వికెట్ కీపర్), కామెరాన్ గ్రీన్, గ్లెన్ మాక్స్‌వెల్, మార్కస్ స్టోయినిస్, సీన్ అబాట్, మిచెల్ స్టార్క్, ఆడమ్ జంపా.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**